క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత ఉండాలి
డీఎల్‌పీవో లక్ష్మణ్



నూజెండ్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని డీఎల్‌పీవో లక్ష్మణ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025 సర్వే ముందస్తు చర్యలో భాగంగా శనివారం మండలంలోని ఐనవోలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. ప్రతిరోజూ చెత్త బండి వస్తుందా, తడిపొడి చెత్తను వేరుచేసి క్లాప్ మిత్రలకు అందిస్తున్నారా లేదా అని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇవోపిఆర్‌డి రబ్బాని,పంచాయితీ కార్యదర్శులు వెంకట్రావు,రామకృష్ణలు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నాదెండ్ల: చందవరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయిన విషయం విదితమే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బదిలీ అయిన సీహెచ్ హనుమంతరావు, వీరయ్య చౌదరి, షేక్ మున్వర్ షరీఫ్, వి.మాధవి, షేక్ లాల్‌మూన్, బి.ఆదిలక్ష్మీలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మీ అందించిన ఆర్థికసాయంతో విద్యార్థులకు హోమ్ వర్క్ చేసుకునేందుకు డైరీలను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సతీష్, టి శ్రీలక్ష్మీ, ఉపాధ్యాయులు కె.లక్ష్మయ్య, అన్నపూర్ణేశ్వరి, ఎం.మాధవి, బి.ఆస్స్, శారద, స్వప్న ఉన్నారు.

నట్టల మందు తాగించాలి

శావల్యాపురం: జీవాల పెంపకదారులు నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామం పశువైద్యశాల్లో మాట్లాడుతూ నట్టల నివారణ మందు తాగించకపోతే జీవాల్లో ఏదుగుదల కోల్పోతుందన్నారు. జీర్ణ వ్యవస్థ మెరుగుదల దోహదపడుతుందన్నారు. నట్టల నివారణ మందును తప్పనిసరిగా జీవాల కల్గియున్న వారందరు తాగించాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 12 వేల జీవాలు ఉండగా ఇప్పటి వరకు 3500 మంది జీవాలకు నట్టల నివారణ మందును తాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఆసిస్టెంట్ సుందరయ్య, అటెండరు పున్నయ్య ఉన్నారు.

వెంకటకృష్ణారావుకు డాక్టరేట్



నరసరావుపేట: రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన ఏనుగంటి అంజయ్య, ద్రాక్షాయమ్మల కుమారుడు యేనుగంటి వెంకట కృష్ణారావుకు చెన్నైలోని భారతీయ విద్యాభవన్‌లో శనివారం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టరేట్ ప్రదానం చేశారు. దివ్యాంగుడైన కృష్ణారావు గత పదేళ్ల నుంచి జాతిపిత మహాత్మా గాంధీ వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు చదువులో ఉచితంగా ఆర్థిక సహాయం చేస్తూ వివిధ సమయాల్లో అవసరమైన వారికి రక్తదానం, దివ్యాంగులకు మూడు చక్రాలు సైకిళ్లు, బ్యాటరీ వాహనాలు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారు. దివ్యాంగులకు వివాహాలు చేయటంలో సహకరించటం, ప్రభుత్వ స్కూళ్లలో మోటివేషన్ క్లాసులు నిర్వహించడం , ఎంఏఎం కాలేజీ చైర్మన్ మెదరమెట్ల శేషగిరిరావుతో కలిసి మానవతా ఫౌండేషన్, ఇంపాక్ట్ ద్వారా వివిధ రకాల సేవలు అందిస్తున్నందుకు డాక్టరేట్ పొందారు.

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి

నరసరావుపేట ఈస్ట్: భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పి.వి.నరసింహారావు జయంతి వేడుకలు శనివారం బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశం ఆర్థికంగా వేగంగా ముందడుగు వేయటానికి పీవీ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే కారణమని సమాఖ్య అధ్యక్షులు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ గుర్తుచేశారు. కార్యక్రమంలో బొగ్గరం ఫణికుమార్, కోట సాంబశివరావు, పోలా నాగేశ్వరరావు, పిల్లుట్ల రమణమూర్తి, విష్ణుబొట్ల మధు, రాంబాబు, విజయ్‌కుమార్, బొగ్గరం మూర్తి, శంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే జంక్షన్ - రైలు ఆగదని టెన్షన్

- శావల్యాపురం మీదుగా నాందేడ్-తిరుపతి (వయా న్యూ పిడుగురాళ్ల) రైలుకు పచ్చజండా
- స్థానికంగా స్టాప్ ఇవ్వాలంటూ ప్రయాణికుల డిమాండ్
- ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించాలంటూ వినతి



శావల్యాపురం రైల్వే స్టేషను

శావల్యాపురం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషను పేరులో జంక్షన్ అనే అక్షరాలు కనిపిస్తాయి. కానీ అవి ఊరికే చదువుకోవడానికే పనికివస్తాయి. సహజంగా జంక్షన్ అంటే ఈ స్టేషన్‌లో రైలు దిగి ఇంకొక రైలు ఎక్కువచ్చు.. వేరొక రైలు మార్గం ఇక్కడ అనుసంధానం అవుతుందన్న దానికి జంక్షన్ పదాన్ని వాడతారు. అయితే శావల్యాపురం రైల్వే స్టేషన్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో రెండు రైళ్లు మాత్రమే ఆగి వెళ్తాయి. ఇక ఇటుగా వెళ్లే ఏ రైలైనా కూతపెట్టుకుంటూ పరుగులుదీస్తూ వెళ్తాయి.


12 రైళ్లు రాకపోకలు!

శావల్యాపురం రైల్వే స్టేషను పరిధిలో నిత్యం 12 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇక ఈ రైల్వే స్టేషను చుట్టుపక్కల 14 గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ కేవలం 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. అయితే వివిధ పనులపై గుంటూరు, విజయవాడ, మార్కాపురం, హుబ్లీ, కాచిగూడ, తిరుపతి, డోన్, ఔరంగబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ స్టేషన్లో అన్ని రైళ్ల నిలుపుదల లేకపోవటంతో వారంతా బస్సులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో కోట్ల రూపాయలు వెచ్చించి నడికూడి-శ్రీకాళహస్తి రైలు మార్గం ట్రాక్ పనులు పూర్తి చేయడంతో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు మాత్రమే ఈ మార్గంలో తిరుగుతున్నాయి.

నూతనంగా నాంథేడ్ నుంచి వయా నడికూడి మీదగా తిరుపతి వెళ్లడానికి తొలి రైలు ప్రయాణానికి రైల్వే శాఖ అనుమతులు జారీ చేసింది. అయితే శావల్యాపురం రైల్వే స్టేషనులో మాత్రం ఈ రైలుకు స్టాపు ఇవ్వకపోవడంతో రైల్వే ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రైలు బాసర, నిజామాబాద్, హైదరాబాదు అలాగే తిరుపతి వెళ్లే వారందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్తగా రైలు వేశారు.. అది తమ స్టేషను మీదుగానే వెళ్లనుందని తెలుసుకున్న పలువురు రైలు ప్రయాణికులకు తీరా కొత్త రైలు తమ స్టేషనులో ఆగదనే విషయం తెలుసుకుని కంగుతిన్నారు. కొత్తగా వేసిన రైలు నిలుపుదల చేస్తే తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారంతా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రొంపిచర్ల రాక-పోకల వివరాలు

రొంపిచర్ల: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ కొంత మేర పూర్తి అవ్వడంతో జూలై నెల నుండి రైలు నడిపేందుకు భారత్ రైల్వేస్ శ్రీకారం చుడుతుంది. జూలై 4వ తేదీ నుండి నాందేడ్ నుండి తిరుపతికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌ను నడపనుంది. ఈ రైలు వారానికి ఒకసారి మాత్రమే నడుస్తుంది. ప్రతి శుక్రవారం నాందేడ్‌లో 16.30 గంటలకు బయలుదేరి మరునాడు 12.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రొంపిచర్ల రైల్వే స్టేషన్‌కు ప్రతి శనివారం ఉదయం 1.25 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు రాత్రి 10.25 గంటలకు రొంపిచర్ల స్టేషన్‌కు వస్తుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ వల్ల మండల ప్రజలకు ఆంధ్ర రాష్ట్రంలోని తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, నిజామాబాద్, బాసర పుణ్య క్షేత్రాలను చేరుకునేందుకు కూడా ఈ ట్రైన్ ఎంతగానో ఉపయోగపడుతుంది.



ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైల్వే టైమింగ్స్

రైళ్లు నిలుపుదల చేయాలి



నాంథేడ్ నుంచి నడికుడి మీదగా తిరుపతి వెళ్లడానికి నూతన రైలు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వటం మంచి శుభాపరిణామం. ఈ రైలు నడపటం ద్వారా తిరుపతి, హైదరాబాదు వివిధ ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రయాణం సులువుగా ఉంటుంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి శావల్యాపురం రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు నిలుపుదల చేయలి. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకొని వెళతాం.

–ముండ్రు హనుమంతరావు, మాజీ సర్పంచ్, మతుకుమల్లి

రైలు ఆగితే బాగుంటుంది



మా గ్రామం నుంచి తొలి ప్రయాణికుల రైల్వే ఏర్పాటుకు అనుమతులు ఇవ్వటం స్వాగతిస్తున్నాం. గతంలో మాదిరిగానే అన్నీ రైళ్లు శావల్యాపురం రైల్వే స్టేషనులో ఆగితే బాగుంటుంది. రైలు ప్రయాణం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లే వారందరికీ సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. రైళ్లు నిలుపుదల లేకపోవటం వల్ల వినుకొండ, నరసరావుపేట వివిధ ప్రాంతాలకు వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

–ముండ్లమూరి అనిల్‌కుమార్, వేల్పూరు

95 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి
ఆర్డీవో మధులత



శావల్యాపురం: నరసరావుపేట డివిజన్ పరిధిలో 148 రెవెన్యూ గ్రామాలు ఉండగా రీసర్వే పనులు 95 గ్రామాల్లో పూర్తి అయినట్లు ఆర్డీవో యం.మధులత శనివారం వెల్లడించారు. భూములు రీసర్వే చేయటం వలన అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఒక కుటుంబంలో ఉన్న ఎల్‌పీయం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) నంబర్లు జాయింట్ ఖాతాలను వేరు చేయు పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకుగాను డివిజన్ పరిధిలో 6 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు వికలాంగులకు ఈనెల 26 నుంచి 30 వరకు రేషన్ పంపిణీ కార్యక్రమం రేషన్ డీలర్లు నేరుగా ఇళ్లగా వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ రహదారి 544డి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 3డి నోటిఫికేషన్ అనుమతులు త్వరలో మంజూరవుతాయని తదుపరి పనులు శరవేగంగా జరుగుతాయన్నారు.

పాఠశాలకు భోజన ప్లేట్లు వితరణ

నూజెండ్ల: మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక పాఠశాలలో పోత్తూరి జనార్దన్‌రావు శనివారం విద్యార్థులకు మూడు వేల రూపాయలు విలువైన భోజనం ప్లేట్లు, గ్లాసులు బహూకరించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. దాతలు సహకారం ఉంటే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని వారంతా పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నరేంద్రరెడ్డి



మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. జులై ఐదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడదగిన సివిల్, క్రిమినల్, ప్రిలిటిగేషన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించబడతాయన్నారు. పట్టణ పరిధిలో ఉన్న రెండు కోర్టులలో రాజీపడదగిన 394 కేసులు ఉన్నాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వలన కక్షిదారులకు వ్యయ ప్రయాసలతో పాటు విలువైన సమయం ఆదా అవుతుందన్నారు.

బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ ఏడీఏ



నరసరావుపేటరూరల్: సబ్ డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా కె.వి.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్లలోని భూసార పరీక్షా కేంద్రంలో ఏడీఏగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీఏగా విధులు నిర్వహించిన పి.మస్తానమ్మకు పోస్టింగ్ ఇవ్వలేదు. నరసరావుపేటలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని బదిలీల ఆదేశాల్లో పేర్కొన్నారు.

రీసైక్లింగ్ వ్యాపారులు నిబంధనలు పాటించాలి

వినుకొండ మునిసిపల్ కమిషనరు సుభాష్‌చంద్రబోస్



వ్యాపారులతో మాట్లాతున్న కమిషనరు

వినుకొండ: అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందస్తుజాగ్రత్తలు, ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమషనరు సుభాష్‌చంద్రబోస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యలయంలో శనివారం పాత ఇనుపసామన్ల దుకాణాలు, గోడౌన్లు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు అగ్నిపమాపక, మున్సిపల్ అధికారుల సూచనలమేరకు తగుజాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతియజమాని 1000 లీటర్ల వాటర్ ట్యాంక్, ఇసుక బస్తాలు తోపాటు వ్యాపారసంస్థలకు నలువైపులా దారి ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే కార్మిక శాఖనుంచి తప్పకుండా అనుమతులు ఉండాలని అన్నారు. ప్రతి 15 రోజులకొకసారి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నిబంబధనలకు వ్యతిరేకంగా నిర్వహించే సంస్థలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు ఇస్మాయిల్‌తోపాటు వ్యాపారులు పాల్గొన్నారు.

చివరి కిలో వరకు పొగాకు కొనుగోలు చేస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి



డ్రోన్ ఆపరేట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ అరుణ్‌బాబు

నాదెండ్ల: రైతుల వద్ద నుంచి చివరి కేజీ వరకూ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. చిలకలూరిపేట నూతన మార్కెట్‌యార్డులో హెచ్‌డీ నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పతనంతో పొగాకు రైతులు సతమతమవ్వటంతో ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు గ్రేడ్‌ల వారీగా విభజించుకుని పొగాకును తరలించి మంచి ధర పొందాలన్నారు. జిల్లాలో 99 వేల క్వింటాళ్ళ నిల్వ ఉందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని యడ్లపాడులో మొదటి కేంద్రం ప్రారంభించి కొనుగోలు చేస్తున్నామని, చిలకలూరిపేటలో రెండో కేంద్రం ప్రారంభించామన్నారు. రైతుల వద్ద పూర్తిగా పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. మొదటి గ్రేడ్ ధర కేజీ రూ.120లు, రెండో రకం గ్రేడ్ కేజీ రూ.90లు మేర ఎక్కువ మంది వద్ద నుంచి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. యాప్‌లో రిజిష్టరైన ప్రతి రైతు ఫోన్‌కు మెసేజ్ వస్తుందని, తద్వారా రైతులు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. ఇప్పటికే రైతులకు రూ.300 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గతంలో ధాన్యం విక్రయించిన రైతులకు రూ.1700 కోట్లు చెల్లించామన్నారు.

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ రైతు సమస్యలను దృష్టిలో ఉంచుకొని చిలకలూరిపేటలో రెండో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

తేమ శాతం 20 మించకుండా నాణ్యమైన పొగాకు తరలించాలన్నారు. 25 కేజీల నుంచి 150 కేజీల వరకూ బరువుండేలా బేళ్లు తీసుకురావాలన్నారు. జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ పొగాకు సాగువిస్తీర్ణం పెరగటంతోనే ధరలు తగ్గాయన్నారు.

కార్యక్రమంలో డీఏవో జగ్గారావు, ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ హుస్సేన్, డీఎం నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సొలస గ్రామానికి చెందిన రైతు జయరాజ్‌కు రూ.9.80 లక్షల విలువైన డ్రోన్‌ను సబ్సిడీపై అందించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చిలకలూరిపేట: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పోలిరెడ్డిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జె హైమావతి తెలిపారు. పాఠశాల ఆవాస ప్రాంతాలైన పోలిరెడ్డిపాలెం, మదర్‌థెరిస్సా కాలనీలలో శనివారం విద్యార్థులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నాణ్యమైన ఇంగ్లిషు మీడియం విద్యతో పాటు స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ పాఠ్యాంశాలు బోధించబడతాయన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇవ్వబడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శైలజ, పోటు శ్రీనివాసరావు, కె. అరుణ, జి. ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాంబాబు



సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం చిత్రాలయ సెంటర్‌లోని ఆయిల్ మిల్లుల కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తు కార్మిక హక్కులను హరించి వేస్తున్నదని తెలిపారు. దేశ సంపదను అంబానీ, అదానీలను దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణ రాజు, సి.హెచ్.నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు షేక్.చినజాన్‌సైదా పాల్గొన్నారు.

తొలిఏకాదశి ఏర్పాట్ల పై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

వినుకొండ: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా వినుకొండ కొండపైన జరిగే తిరుణాళ్లకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి.వి. ఆంజనేయులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జూలై మొదటివారంలో జరిగే తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో భద్రాతా ఏర్పాట్లతోపాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరుతోపాటు, మరుగుదొడ్లు, అత్యవసర వైద్యసదుపాయాలు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనరు సుభాష్ చంద్రబోస్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్ల వైర్లు చోరీ

రొంపిచర్ల: మండలంలోని వీరెడ్డిపాలెం గ్రామం సమీపంలోని పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ పంపుసెట్ల నుంచి శుక్రవారం రాత్రి దొంగలు వైర్లను దొంగిలించుకు వెళ్లారు. ముగ్గురు రైతులకు సంబంధించిన పంపుసెట్ల నుండి త్రీ కోర్ వైర్ 150 మీటర్ల మేర ఎత్తుకు వెళ్ళినట్లు రైతులు తెలిపారు. వైరు విలువ రూ.20 వేలు వరకు ఉంటుందని తెలియచేశారు. అయితే ఇటీవల కాలంలో రెడ్డిపాలెం కొత్తపల్లి, ఎడ్వర్డుపేట గ్రామాల పొలాల్లో వ్యవసాయ పంపుసెట్ల వద్ద ఉన్న వైర్లను దొంగిలించుకోవడం దొంగలకు పరిపాటైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒకే వ్యవసాయ పంపుసెట్టు నుంచి రెండు, మూడుసార్లు ఏర్పాటు చేసిన వైర్లను దొంగిలించినట్లు రైతులు తెలియచేస్తున్నారు.

చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డి పి.సుగుణ

శావల్యాపురం: చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఈవోపీఆర్డీ పి.సుగుణ అన్నారు. శనివారం మండల కేంద్రం శావల్యాపురంలో చెత్త సంపద కేంద్రం అవరణలో నూజెండ్ల, శావల్యాపురం, వినుకొండ రూరల్ మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు చెత్త సంపద కేంద్రాల ద్వారా ఆదాయ మార్గాలు పెంపొందించటానికి తీసుకోవాల్సిన విధివిధానాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాల ద్వారా తడి పొడి చెత్తను వేరు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా క్లాప్‌మిత్రలను వినియోగించుకోవాలన్నారు. ఇంటింటికీ క్లాప్ మిత్రలు తిరిగి తడి పొడి చెత్తను సేకరించిన అనంతరం సంపద కేంద్రానికి వచ్చేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ ఈవోపీఆర్‌డీ షేక్ రబ్బానీ, శ్రీనివాసరెడ్డి, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలులో వ్యాసరచన పోటీలు

నాదెండ్ల(యడ్లపాడు): జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యడ్లపాడు జెడ్పీహైస్కూలులో శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ, హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మొదటి బహుమతి పఠాన్ నాస్మిన్, రెండో బహుమతి వల్లెపు నవీన, మూడో బహుమతి బండా జమితాగ్రేస్‌లు సాధించారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. వైద్యాధికారి భరద్వాజ మాట్లాడుతూ పొగాకు వాడకం వలన అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పొగాకు వాడకాన్ని నిలిపివేయాలన్నారు.

నైస్ పాఠశాలకు విద్యాసామగ్రి వితరణ



మైనంపాడు నైస్‌పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న మర్రి లలితమ్మ

నాదెండ్ల: అనాథ చిన్నారులను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేస్తున్న నైస్ పాఠశాల సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సతీమణి, చిలకలూరిపేట విద్యామిత్ర మండలి అధ్యక్షురాలు మర్రి లలితమ్మ చెప్పారు. కనపర్రు శివారు మైనంపాడులోని నైస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు మిత్రమండలి సభ్యులు విద్యాసామగ్రిని శనివారం అందించారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన అత్తోట రామారావు కుటుంబ సభ్యులు అందించిన ఆర్థికసాయంతో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రి అందించారు. ఈ సందర్భంగా మర్రి లలితమ్మ మాట్లాడుతూ, తల్లిదండ్రులు లేని అనాథలను విద్యావంతులుగా చేసి ప్రయోజకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్న నైస్ పాఠశాలకు తమ విద్యామిత్ర మండలి తరపున కొన్నేళ్ళుగా చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువుకు తమ వంతుగా సాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు, నైస్ పాఠశాల యాజమాన్యం, అత్తోట శ్యామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం పాఠశాలలో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎం.దిలీప్‌కుమార్, వైఆర్‌కె రెడ్డి, సి.హెచ్ ఉషారాణి, కె.అనసూయ, కె.నాగలక్ష్మిలు బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎం.లక్ష్మీనరసమ్మ, ప్రధానోపాధ్యాయుడు ఎం.సుందరరావు, ఏఏ మదుకుమార్, ఎన్.నాగిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.